నైపుణ్యం ఉన్నవారికే డిమాండ్ : సిటియు విసి

విజయనగరం టౌన్ : మారుతున్న ఆర్థిక, సామాజిక, భౌగోళిక పరిస్థితులను బట్టి భవిష్యత్తులో జీవనోపాధికి విషయ జ్ఞానంతో పాటు నైపుణ్యం కూడా ఎంతో అవసరమని గిరిజన యూనివర్శిటీ విసి కట్టమని అన్నారు.ఆదివారం యూనివర్శిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. నేషనల్ అకాడమీ అఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో జాతీయ జలజీవన్ మిషన్ సహకారంతో నిర్వహించ తలపెట్టిన ప్లంబింగ్, మాసనరీ బ్రాంచిల్లో సుమారు 60మందికి స్కిల్ అప్ గ్రేడేషన్ ప్రోగ్రాం ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను నిరంతరం పదును పెట్టుకోవాలన్నారు. అటువంటి వారికే మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ అకాడమీ అఫ్ కన్‌స్ట్రక్షన్ అడిషనల్ డైరెక్టర్ జి.చిట్టిబాబు, సెంటర్ ఇన్‌ఛార్జిలు ఎం.సుధాకర్, కె.నాగేశ్వర రావు, ఎం.కృష్ణంనాయుడు, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్లాల్లో ధాన్యం.. కళ్లల్లో దైన్యం

- ఇంకా ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- తుపాను హెచ్చరికతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-మెరకముడిదాం

'ఈ ఏడాది రైతులు అధైర్య పడాల్సిన పనిలేదు.. ధాన్యం కొనుగోలుకు ప్రతి ఆర్‌బికెను సిద్ధం చేస్తున్నాం. రైతు కళ్లాల వద్దకే వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తాం.. ధాన్యం గోనె సంచులతో కలిపి కొనుగోలు జరిగిన 21 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాం..' ఇదీ ఇటీవల మండలం కేంద్రంలో జరిగిన సమావేశంలో జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, చెప్పిన మాటలు.. అతను చెప్పిన మాటలకు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న దానికి పొంతన లేకుండా పోతుంది. ఇప్పటి వరకూ ఏ రైతు భరోసా కేంద్రంలోనూ ధాన్యం కొనుగోలు ప్రారంభం కాలేదు. చాలా మంది రైతులు వరి నూర్పులు పూర్తి చేసి కళ్లాల్లో ధాన్యం పెట్టుకుని వాటిని విక్రయించేందుకు ఎదురు చూస్తున్నారు. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంకా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై దృష్టి పెట్టలేదు. మరోవైపు తుపాను హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 8,340 ఎకరాల్లో వరి పంట వేశారు. సుమారు 95 శాతం కోతలు, మరో 35 శాతం వరి నూర్పులు పూర్తయ్యాయి. వరి నూర్పులు పూర్తయిన చోట అధికారులు వెళ్లి ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఇందుకు గాను మండలంలో ఉన్న 18 రైతు భరోసా కేంద్రాలను సిద్ధం చేయాలి. కానీ ఆ పని ఎక్కడా జరగలేదు. కనీసం రైతు భరోసా కేంద్రాలకు ధాన్యం కొనుగోలుకు కావాల్సి సామగ్రి కూడా చేరలేదంటే ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చును.

కళ్లాల్లోనే ధాన్యం..

మండలంలోని చాలా మంది రైతులు వరి నూర్పులు వేశారు. నూర్పులు వేసిన వెంటనే ఆర్‌బికె సిబ్బంది గోనె సంచులతో తమ కళ్లాల వద్దకే వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తారని ప్రచారం జరగడంతో రైతులంతా అది నిజం అనుకుని నూర్పులు వేశారు. కానీ కళ్లాల వద్దకు ఎవరూ రాలేదు. దీంతో రైతులు కళ్లాల్లోని ధాన్యం వద్ద పడిగాపులు కాస్తున్నారు.

గర్భాంలో కల్లంలో రాశులుగా ఉన్న ధాన్యం

తుపాను హెచ్చరికతో ఆందోళన

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం వల్ల రానున్న రెండు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట మొత్తం కల్లాల్లో రాశులుగా వేసి ఉన్న సమయంలో వర్షాలు పడితే తడిసిపోయి నష్టం జరిగే ప్రమాదం ఉందని అధికారులు కనీసం గోనే సంచులైన ఇస్తే ధాన్యాన్ని గోనెలకు ఎత్తి ఎక్కడో ఒక చోట నిల్వ చేస్తామని రైతులు చెబుతున్నారు.

తేమ శాతం కోసం రాశులుగా ధాన్యం..

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలంటే తేమ శాతం 17 కంటే మించకూడదని అధికారులు చెప్పడంతో చాలా మంది రైతులు కల్లాల్లో ధాన్యాన్ని ఆరబెట్టే పనిలో పడ్డారు. అందుకోసం రాశులుగా పోసి ఆరబెడుతున్నారు. సాయంత్రం అవ్వగానే మంచు పడకుండా వాటిపై తార్పాన్లు కప్పుతున్నారు. ఇలా గత వారం రోజులుగా కల్లాల్లోను, పొలాల్లోను ధాన్యం వద్ద రైతులు కాపలా కాస్తున్నారు. గోనె సంచులు ఇవ్వాలని వాలంటీర్లు, ఆర్‌బికె సిబ్బందిని అడిగితే తమకు సమావేశాలు ఉన్నాయని తరువాత ఇస్తామని దాటవేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని ముందు కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం

మండలంలోని 18 రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు సిద్ధమవుతున్నాం. త్వరలో ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. టెక్నికల్ అసిస్టెంట్ ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించిన తరువాతే కొనుగోలు చేయాని ఆదేశాలు మేరకు తేమ శాతం పరిశీలన చేస్తాం.

- శ్రావణితేజ, వ్యవసాయాధికారి

ధాన్యం విక్రయించేందుకు ఎదురు చూస్తున్న రైతులు శ్రీను, శివ

5కె వాక్‌లో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఉద్యోగులను, ఉపాధ్యాయులను
మోసగించిన ప్రభుత్వం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- పార్వతీపురం కలెక్టరేట్

ఉద్యోగులను, ఉపాధ్యాయులను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మోసం చేస్తోందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆదివారం పార్వతీపురంలో ఉపాధ్యాయుల 5కె వాక్, బొబ్బిలిలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. పార్వతీపురంలోని బెలగాం చర్చి సెంటర్ వద్ద ప్రారంభమైన వాక్ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2019కు ముందు పాద యాత్రలో సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ స్కీమ్‌ను తీసుకు వస్తానని జగన్ హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీని నెరవేర్చ లేదు కదా, తెలియక హామీ ఇచ్చానని చెబుతున్నారని, ఇది ఉద్యోగులను, ఉపాధ్యాయులను మోసం చేయడమేనని అన్నారు. 3 లక్షల మంది ఉపాధ్యాయుల, ఉద్యోగుల పెన్సన్ భద్రతకు సంబంధించిన అంశంపై మాట ఇచ్చి మడమ తిప్పారని అన్నారు. సిపిఎస్ రద్దు అంశం రాజకీయ ఎజెండాగా మారబోతుందని, రద్దు చేయక పోతే రాజకీయ నష్టం తప్పదని హెచ్చరించారు. అనేక రాష్ట్రాలలో సిపిఎస్‌ను రద్దు చేస్తుంటే ఇబ్బంది లేనిది మన రాష్ట్రానికి ఎందుకు ఇబ్బంది వస్తుందని ప్రశ్నించారు. భవిష్యత్‌లో సిపిఎస్ పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. 5కె వాక్ చర్చి జంక్షన్ నుండి బైపాస్ రోడ్డు, పాత బస్టాండ్, మెయిన్ రోడ్డు మీదుగా జరిగింది. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మురళీమోహనరావు, జిల్లా అధ్యక్షులు టి.రమేష్, జిల్లా సహాధ్యక్షులు బి. విజయకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజామణి, సిపిఎస్ ఉద్యోగుల సంఘం కన్వీనర్ ఎం. శంకర్‌రావు, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, కృపానందం తదితరులు పాల్గన్నారు.

సిపిఎస్ రద్దు చేసేవరకు పోరాటం

బొబ్బిలి : సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేసే వరకు పోరాటం చేస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.విజయగౌరి అన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని కోరుతూ ఆదివారం ఎన్‌జిఒ హోం సమీపంలో సంతకాల సేకరణ చేపట్టారు. సంతకాల సేకరణను ఉద్యోగ, ఉపాధ్యాయ జెఎసి కన్వీనర్ సిహెచ్ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామని జగన్ ఇచ్చిన హామీని నేటికీ అమలు చేయడం లేదన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జెఎసి జిల్లా నాయకులు మురళి, ఎన్‌జిఒ రాష్ట్ర నాయకులు డివి రమణ, పెన్షనర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి, యుటిఎఫ్ జిల్లా నాయకులు ప్రసన్నకుమార్, కేశవరావు, అనంతరావు, రమేష్, శ్రీనివాస్, కృష్ణదాసు తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రభుత్వ నిరంకుశ చర్యలపై 7న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అవలంభిస్తున్న నియంతృత్వ, అప్రజాస్వామిక వైఖరిని నిరసిస్తూ ఈనెల 7న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు వై.అప్పారావు తెలిపారు. ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం అమర్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు వై.అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్క కరువు భత్యం కూడా విడుదల చేయలేదని, భవిష్య నిధి, జీవిత భీమా చెల్లింపులు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ రావు, డిఎస్ బాలాజీ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

గాన దేవుడు ఘంటసాల

- సంగీత దర్శకుడు సాలూరు వాసురావు
- వాసురావుకు స్వర్ణ కంకణం బహూకరణ

ప్రజాశక్తి -విజయనగరం కోట

సంగీత ప్రియులంతా ఘంటసాల వెంకటేశ్వరరావును గానగంధర్వుడు, మధుర వచస్వి ఇలా అనేక పేర్లతో పిలుస్తుంటారని, తన దృష్టిలో మాత్రం గానదేవుడని ప్రముఖ సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు వారసులు సాలూరు వాసు రావు కొనియాడారు. ఘంటసాల శత జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఆనంద గజపతి కళాక్షేత్రంలో ఘంటసాల స్మారకళాపీఠం ఆధ్వర్యంలో ఘంటసాల నిర్విరామ 12గంట పాటల కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ముందుగా సాలురు వాసురావు తదితరులు ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వాసు రావుకు ఘంటసాల స్మారక కళా పీఠం ఆధ్వర్యాన డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, అక్షయ కనస్ట్రక్షన్ అధినేత ఎగిరెడ్డి తిరుపతి నాయుడు, ఘంటసాల స్మారక కళాపీఠం సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం స్వర్ణ కంకణాన్ని బహూకరించారు. అనంతరం సన్మాన గ్రహీత మాట్లాడుతూ సాలూరు రాజేశ్వరరావు, ఘంటసాల సినీ రంగానికి సూర్యచంద్రులు లాంటివారు అన్నారు. టిటిడి ఆస్థానంలో ఘంటసాల గానంతో ఎన్నో భక్తి గీతాలు చేశారన్నారు. ఆయన విగ్రహాన్ని టిటిడిలో ఏర్పాటు చేయడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ ఘంటసాల వెంకటేశ్వరరావు తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నా రన్నారు. నిర్విరామ సంగీత కార్యక్రమం శ్రోతలను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు ఎం. భీష్మారావు, అధ్యక్షులు గ్రంధి విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శి ధవళ సర్వేశ్వరరావు, కోశాధికారి వైవివి సత్యనారాయణ , స్వామీజీ, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి, ఉమా శంకర్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, నాలుగెస్సుల రాజు, మేక కాశీ విశ్వేశ్వరుడు, ఎఎంసి ఛైర్మన్ నడిపిన శ్రీనివాసరావు, కాపుగంటి ప్రకాష్, డాక్టర్ ఎ.గోపాలరావు పాల్గొన్నారు.

వాసురావుకు స్వర్ణకంకణంతో సన్మాన పత్రం అందిస్తున్న ఘంటసాల స్మారక కళాపీఠం సభ్యులు

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి అశోక్
- జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేష్, రామ్మోహన్ ఎన్నిక

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యా రంగానికి నష్టం చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి విద్యా రంగాన్ని కాపాడుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ. అశోక్ అన్నారు. విద్యా రంగ, విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి పోరాటం చేయడంతో పాటు సామాజిక సేవలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, కార్యకర్తలు ముందుంటారని చెప్పారు. గంటి ప్రసాదం భవనంలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా 30వ మహాసభలో రెండోరోజు ప్రతినిధులను ఉద్దేశించి అశోక్ మాట్లాడారు. కోవిడ్ సమయంలో కోవిడ్ బాధితులకు మందులు, భోజనాలు, నిత్యావసర సరుకులను అందించిన ఘనత ఎస్‌ఎఫ్‌ఐకు దక్కుతుందన్నారు. రక్తదానాలు చేసి గర్భిణులను, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆదుకొని ప్రాణదాతలు అవుతున్నారన్నారు.

విద్యారంగ పరిరక్షణకు చేపట్టిన బస్సు యాత్రను శ్రీకాకుళంలో పోలీసులతో అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని, నిర్బంధాలను ఎదిరించి విజయనగరంలో బహిరంగ నిర్వహించామని చెప్పారు. భవిష్యత్తులో విద్యా రంగ పరిరక్షణకు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు, శాస్త్రీయ విద్య కోసం పోరాడాలని కోరారు. బాలికలపై దాడులను నివారించాలని డిమాండ్ చేశారు. ఖాళీ ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు ఎస్‌ఎఫ్‌ఐ, విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని కోరారు. మాజీ అధ్యక్షులు కె.ఆనంద్ మాట్లాడుతూ ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగ సమస్య పెరుగిపోతుందని, నోటిఫికేషన్ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మహాసభలో గత కార్యక్రమాలను చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించారు.

మహాసభలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

మతోన్మాదాన్ని తిప్పి కొట్టాలి

దేశంలో పెట్రేగిపోతున్న మతోన్మాదాన్ని తిప్పి కొట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ కోరారు. మహాసభలో విద్యార్థులను ఉద్దేశించి సౌహార్ద సందేశం ఇచ్చారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద దాడులు పెరిగిపోయాయని అన్నారు. భగత్ స్ఫూర్తితో మతోన్మాదాన్ని తిప్పి కొట్టేందుకు ఐక్యంగా పోరాడాలని సూచించారు. అనంతరం మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. సంక్షేమ హాస్టల్లో మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేసి,మౌలిక సౌకర్యాలు కల్పించాలని, బైజూస్ ఒప్పందాన్నిరద్దు చేయాలి. విద్యాసంస్థల్లో ఎన్నికలు నిర్వహించాలి. మహిళలపై దాడులను అరికట్టాలి. విభజన హామీలు అమలు చేయాలి. గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయించాలి, జెఎన్‌టియుజికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని చేయాలి. ఎయిడెడ్ విద్యాసంస్థల ప్రయివేటీకరణ ఆపాలి. జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తెరిపించి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తీర్మానాలు చేశారు.

అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, రామ్మోహన్

ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీ ఎన్నిక

29మందితో ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్ష,కార్యదర్శులుగా సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా డి.రాము, వి. చినబాబు, సతీష్ దేవ్ సింగ్, సిహెచ్ రామకృష్ణ, జె.రవి కుమార్, ఎం. హర్ష, ఎం. సౌమ్య, బి. లక్ష్మణ్ ఎన్నికయ్యారు.

పిల్లల్లో సామర్థ్యాల వృద్ధే లక్ష్యం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు పక్కా ప్రణాళికతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లాలో విద్యాభివృద్ధికి, మెరుగైన ఫలితాలు సాధనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తనను కలిసిన ప్రజాశక్తికి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

- ప్రజాశక్తి, విజయనగరం టౌన్

- డ్రాపౌట్ పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు
- రోజువారీ పరీక్షలతో టెన్త్ ఫలితాల మెరుగుకు ప్రణాళిక
- పక్కాగా గోరుముద్ద పథకం అమలు
- 'ప్రజాశక్తి'తో డిఇఒ లింగేశ్వరరెడ్డి ముఖాముఖి





జిల్లాలో డిఇఒగా విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేమిటి?

జిల్లాలో విద్యారంగంలో మార్పులు తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టాం. ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారు. వారి ద్వారా నాణ్యమైన బోధన, ప్రతిభ కలిగిన విద్యార్థులను తయారు చేయడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. జిల్లాపై అవగాహన ఉండటంతో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకొని జిల్లాకు ఉన్న విద్యలనగరమనే పేరును నిలబెట్టేందుకు కృషి చేస్తాను.

ప్రాథమిక స్థాయి నుంచి పిల్లల విధ్యాభివృద్ధికి తీసుకునే చర్యలేమిటి?

నేడు ప్రపంచంలో ఆంగ్ల విద్యకు అధిక ప్రాధాన్యత ఉన్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ప్రాథమిక విద్యనుంచే స్పోకెన్ ఇంగ్లీషును నేర్పించడం జరుగుతుంది. విద్యార్థుల్లో ఉండే సామర్థ్యాలు ఆధారంగా వారికి బోధన చేయడంతో పాటు, వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగిస్తున్నాం. ప్రాథమిక విద్యలోనే సరైన విద్యా విధానం అమలు చేయడమే లక్ష్యంగా రానున్న కాలంలో కృషి జరుగుతుంది. వారం రోజుల్లో ఏమి చేయాలి తర్వాత వారంలో ఏవిధంగా బోధన చేసి విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలనే అంశంపై ప్రణాళికలు అమలు చేస్తున్నాం. అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి దానికి అనుగుణంగా బోధన జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

బడి బయట పిల్లల్ని బడిలో చేర్పించేందుకు తీసుకుంటున్న చర్యలు?

జిల్లాలో బడిబయట పిల్లలు లేకుండా చేసి వారిని పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చాం. దీన్ని ప్రతి రోజు పర్యవేక్షించే బాధ్యత ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖాదికారులకు అప్పగిస్తాం. బడి బయట పిల్లల కోసం ప్రతి స్కూల్లో ఒక రిజిష్టర్ మెయింటెయిన్ చేయాలని చెప్పాం.

బోధనలో మెరుగుదలకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

బోధనలో మెరుగుదలకు ప్రతి రోజూ ఉపాధ్యాయులు పాఠ్యాంశానికి సంబంధించిన మెటీరియల్ తీసుసుకోవాల్సి ఉంటుంది. టీచింగ్ నోట్సు ప్రతి ఉపాధ్యాయుడు తయారు చేసుకొని పాఠ్యాంశం బోధనకు వెళ్లేలా ఆదేశాలు ఇచ్చాం. వాటిని అమలు చేసే బాధ్యతను ప్రధానోపాధ్యాయులకు, ఎంఇఒలకు అప్పగించాం. స్కూలు కాంప్లెక్సు వారీ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. దీనిపై 14 రోజులకొకసారి సమీక్ష చేసుకోవాల్సి ఉంది.

పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధనకు తీసుకుంటున్న చర్యలేమిటి?

పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేలా పక్కా ప్రణాళికతో బోధనతో పాటు, విద్యార్థుల సామర్థ్యాలను అంచనావేసి అందుకు తగిన విధంగా సిద్ధం చేసేలా సబ్జెక్టు ఉపాధ్యాయులకు ప్రణాళికలు ఇచ్చాం. ప్రతి రోజు ఆయా సబ్జెక్టులపై పరీక్ష పెట్టి వాటిని వెంటనే మూల్యాంకనం చేసి విద్యార్థులకు తెలియజేయనున్నాం. పబ్లిక్ పరీక్ష ప్రశ్నాపత్రం మోడల్‌లో పరీక్షలు నిర్వహిస్తాం.

టెన్త్ పరీక్ష ఫీజును కొన్ని ప్రయివేటు పాఠశాలల్లో ఎక్కువ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

ఎవరైనా పరీక్ష ఫీజులు అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే చెల్లించాలి. ఎవరైనా అదనంగా తీసుకుంటే తమకు ఫిర్యాదు చేయవచ్చు. విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ జరిపేలా చూస్తాం.

మధ్యాహ్న భోజన పథకం అమలుపై తీసుకుంటున్న జాగ్రత్తలు?

మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం పక్కాగా అమలు చేయాలి. ఎవరైనా ప్రజాప్రతినిధులు పరిశీలించేందుకు వస్తే వారికి వంటలు రుచి చూపించాలి. పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలి. మెనూ అమలులో రాజీ పడే ప్రసక్తే లేదు. పథకం నిర్వాహకులకు బకాయిలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చెల్లించేలా కృషి చేస్తాం.

నావికాదళ వేడుకల్లో పాల్గొన్న హవల్దార్, ప్రిన్సిపల్, విద్యార్థులు

భారత నావికాదళ దినోత్సవ వేడుకలు

శృంగవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. కేశవరావు అధ్యక్షతన భారత నావికాదళ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ భారత నావికాదళ గొప్పతనాన్ని, 1971లో పాకిస్తాన్‌పై విజయాలను గుర్చి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం 13 ఆంధ్ర బెటాలియన్‌కు చెందిన హవల్దార్ సురేంద్ర ప్రసాద్, రవీంద్ర రాథోర్, కళాశాల ఎన్‌సిసి కేర్ టేకర్ భాస్కర్, కళాశాల అధ్యాపకులు, ఎన్‌సిసి క్యాడెట్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిపి, తదితరులు

బిసి మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

వేపాడ : ఈ నెల 7న విజయవాడ కేంద్రంగా జరగనున్న జయహో బీసీ మహాసభను జయప్రదం చేయాలని ఎంపిపి డొగ్గ సత్యవంతుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న సభలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, మండల పార్టీ అధ్యక్షులు మమ్ములూరు జగన్నాథం, వైస్ ఎంపిపి అడప ఈశ్వర్రావు, సర్పంచుల సంఘం అధ్యక్షులు నిరుజోగి వెంకట్రావు, నెట్ క్యాప్ డైరెక్టర్ చలుమూరి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

లక్కవరపుకోట : ప్రభుత్వ శాఖలలో వివిధ ఉద్యోగాలకై ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు కె. మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌కోట గాంధీనగర్ ఐదవ వీధిలో శ్రీ లక్ష్య కోచింగ్ సెంటర్ పేరట ఈ నెల ఐదు నుండి శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. నవోదయ, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షలకు శిక్షణతో పాటు కానిస్టేబుల్ ఉద్యోగం నుండి అన్ని శాఖల ఉద్యోగాల కొరకు శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి, నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని అనుభవజ్ఞులైన అధ్యాపకులచే అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. మరిన్ని సమాచారం కొరకు 9618414311, 9618514311 ఫోన్ నెంబర్లను సంప్రదించి, సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపిపి కంది

5,6 తేదీల్లో 'ఇదేం కర్మ రాష్ట్రానికి'

డెంకాడ : 5,6 తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహిం చాలని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు అన్నారు. స్థానిక మండల పార్టీ కార్యాల యంలో ఆదివారం ఆయన క్లస్టర్ల ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, బూత్ ఇంచార్జిలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటియే కార్యక్రమానికి సబందించిన సామగ్రిని గ్రామాలకు తరలించామని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు, విజయనగరం పార్లమెంటరీ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణీరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల శత జయంతి వేడుకలు

వెంకటరాజును సత్కరిస్తున్న ఉప సర్పంచ్ కృష్ణమూర్తి

మెరక ముడిదాం: స్వర చక్రవర్తి పద్మ శ్రీ ఘంటసాల శత జయంతి వేడుకలు ఆదివారం మండలం లోని బైరిపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్వర సంగీత కార్యక్రమంలో గాయకులు కొల్లా వెంకటరాజు, తాడేల రమేష్ మాస్టర్, బోనెల సురేష్ కుమార్, కొల్లా శ్రీనివాసరావులు పాల్గొని ఘంటసాల పాటలను ఆలపించారు. ఇందులో భాగంగా సుప్రసిద్ధ గాయకులు కొల్లా వెంకటరాజును గ్రామ ఉప సర్పంచ్ పప్పల క్రిష్ణ మూర్తి దుస్సాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాదం వెంకటరాజు, సముద్రాల శ్రీధరా చార్యులు, కందుల వెంకటరాజు, సాలాపు చిన్నమునాయుడు, సబ్బి శెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

తనిఖీ చేస్తున్న వైద్యులు

బొబ్బిలి : అభ్యుదయ పాఠశాలలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన మెగా నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరానికి పట్టణ, పరిసర గ్రామీణ ప్రాంతాల నుంచి వందలాది సంఖ్యలో ప్రజలు హాజరై వైద్య పరీక్షలు చేపించుకున్నారు. శస్త్ర చికిత్స అవసరమైన రోగులకు ఉచితంగా శస్త్ర చికిత్స చేయనున్నట్లు అభ్యుదయ కరస్పాండెంట్ మర్రాపు కూర్మినాయుడు, ప్రిన్సిపాల్ శారదా చెప్పారు.

వికలాంగులను చిన్నచూపు చూడొద్దు

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న శ్రీవల్లి

వేపాడ : వికలాంగులను చిన్న చూపు చూడొద్దని వల్లంపూడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీవల్లి అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వల్లంపూడి భవిత కేంద్రంలో ఆదివారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగులు కూడా పలు అంశాల్లో రాణిస్తున్నారని వారిని ఆదర్శంగా తీసుకుని చదవాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అర్జున్ రావు, ప్రత్యేక అవసరాలు గల ఉపాధ్యాయులు ఎన్.విజయలక్ష్మి, ఎన్.సత్యవతి, సిహెచ్ జయంతి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిజెపి హింసాకాండపై సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి- బొబ్బిలి

త్రిపురలో సిపిఎం కార్యకర్తలపై బిజెపి మూకల హింసాకాండను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం జిల్లాలో పలుచోట్ల రాస్తారోకోలు చేపట్టారు. ఈ ఘటనను ప్రజలంతా ఖండించాలని పిలుపునిచ్చారు. బొబ్బిలిలోని గొల్లవీధి జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ త్రిపురలో బిజెపికి సంపూర్ణ బలం లేకపోయినా టిఎంసి, ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి అధికారం చేపట్టి సిపిఎం నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసి హత్యలు చేయడం దుర్మార్గమన్నారు. సిపిఎం కార్యాలయాలపై దాడులు చేసి తగలబెడుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో సిపిఎంను ఎదుర్కొనే సామర్థ్యం లేకపోవడంతోనే హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రధాని మోడీ ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, డివైఎఫ్ఐ, ఐద్వా నాయకులు సురేష్, పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు జంక్షన్‌లో నిర్వహించిన రాస్తారోకోలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు మాట్లాడారు. సిపిఎం కార్య కర్తలపైన, కార్యాలయాల పైన బిజెపి చేస్తున్న హిసాకాండ దాని బరితెగింపునకు, క్రూరత్వానికి నిదర్శనమనిఅన్నారు. త్రిపురలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుంచి తీవ్ర నిర్బంధం కొనసాగిస్తూ రాష్ట్రంలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల కార్యాలయాలను బలవంతంగా మూసివేయించి రౌడీయిజం చేస్తుందని అన్నారు. సిపిఎం ప్రభుత్వాన్ని అనైతిక పొత్తు లతో దెబ్బతీసి అధికారంలోకి వచ్చిన నాటి నుండి వినాశనకర పాలన సాగిస్తుందని అన్నారు. నవంబర్ 30న సిపిఎం నాయకులు, కార్యకర్తలపై చెలరేగి హింసాకాండకు పాల్పడిందని, ఈ ఘటనను ప్రజా తంత్ర వాదులు, ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.జగన్మోహన్, బి.రమణ,

విజయనగరం: రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు

పలుచోట్ల రాస్తారోకోలు

బొబ్బిలి: రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

కొత్తవలస: త్రిపురలో బిజెపి మూకలు సిపిఎం కార్యకర్తల పైన, సిపిఎం కార్యాలయాలపైన చేస్తున్న హిసాకాండ బిజెపి బరితెగింపునకు, దాని క్రూరత్వానికి నిదర్శనమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు అన్నారు. బిజెపి దాడులను నిరసిస్తూ ఆదివారం స్థానిక అంబెద్కర్ జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి త్రిపురలో అధికారంలోకి వచ్చిన నుండి తీవ్ర నిర్బంధం కొనసాగిస్తూ రాష్ట్రంలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల కార్యాలయాలను బలవంతంగా మూసివేయించి రౌడీయిజం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి మరక లేకుండా సుపరిపాలన అందిస్తున్న సిపిఎం ప్రభుత్వాన్ని అనైతిక పొత్తులతో దెబ్బతీసి అధికారంలోకి వచ్చిన నాటి నుండి, వినాశనకర పాలన సాగిస్తుందని అన్నారు. నవంబర్ 30న సిపిఎం నాయకులు, కార్యకర్తలుపై చెలరేగి హింసాకాండకు బరి తెగించిందని దీనిని ప్రజా తంత్ర వాదులు, ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : త్రిపురలో సిపియం కార్యకర్త షాహిద్ మియాను హత్యచేసిన బిజెపి గూండాల వైఖరిని ఖండిస్తూ ముక్కాం కూడలి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ మాట్లాడుతూ త్రిపురలో 2018లో దొడ్డిదారిన అధికారానికి వచ్చిన బిజెపి ప్రజలను కష్టాల నుండి ఆదుకోవడం చేతగాక ప్రశ్నిస్తున్న ప్రజలను ముఖ్యంగా సిపిఎం కార్యకర్తలను హతమార్చుతూ హత్యా రాజకీయాలు చేయడం చేతగాని తనానికి నిదర్శనమన్నారు. ప్రతిపక్షాలను, ప్రజాసంగాల కార్యాలయాలను ధ్వంసం చేస్తూ, అధికారి మందంతో ప్రజలను భయపెడుతూ బరితెగించి హత్యలకు పాల్పడటం సరైందికాదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: త్రిపురలో బిజెపి చేస్తున్న హత్యా రాజకీయాలను అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. త్రిపురలో బిజెపి చేస్తున్న హత్యా రాజకీయాలను ఆదివారం నిరసిస్తూ విలేకర్ల సమావేశంలో ఖండించారు. బిజెపికి సొంత బలం లేకపోయినప్పటికీ తృణమూల్ కాంగ్రెస్ ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి అధికారం చేపట్టిందని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్నామన్న అహంకారంతో సిపిఎం నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడి హత్యలు చేస్తుందన్నారు. సిపిఎంను ఎదుర్కోవడం చేత కాక పార్టీ కార్యాలయాలను తగులబెట్టడం, హత్యలు చేయడం సిగ్గుచేటన్నారు.

శృంగవరపుకోట: త్రిపురలోని మారణ హోమానికి కారణమైన బిజెపి గుండాలను అరెస్ట్ చేయాలని సిపిఎం నాయకులు మద్దిల రమణ, గాడి అప్పారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో, ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ త్రిపుర రాష్ట్రంలో సిపిఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు నాలుగున్నరేళ్ల తర్వాత తిరిగి తమ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించుకుంటే దానిని చూసి ఓర్వలేని త్రిపుర అధికార బిజెపి పార్టీ కసాయి గుండాలు సిపిఎం పార్టీ నాయకులు పైన, కార్యకర్తల పైన కత్తులతో దాడులకు దిగారన్నారు. ఈ దాడుల్లో సాహెబ్ మియా మరణించగా మరో 15 మంది పార్టీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఈ మారణకాండకు కారకులైన ఆర్ఎస్ఎస్, బిజెపి అధికార పార్టీ కసాయి గుండాలను తక్షణమే శిక్షించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. అనంతరం పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు పి భాస్కర్, బి శంకర్రావు, ఎస్ రాము, జి సాంబయ్య, ఎం అప్పలనాయుడు, కె గోపి, టి చిన్న, సుధా, నాగేశ్వరరావు, సురేష్, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కోట: నిరసన ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు

అత్యాచారాలు, హింసను అరికట్టాలి: ఐద్వా

ప్రజాశక్తి - వంగర

మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హింసను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) విజయనగరం జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ డిమాండ్ చేశారు. ఐద్వా ఆలిండియా పిలుపు మేరకు రాజాం మండలం రాజయ్యపేట గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం హింసా వ్యతిరేక ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి కోసం నిరంతరం మహిళా సంఘం పని చేస్తుందన్నారు. రోజూరోజుకి మహిళలపై రకరకాల రూపాల్లో దాడులు అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. దేశంలో రోజుకు 86 అత్యాచారాలు, గంటకి 49 నేరాలు మహిళలపై జరుగుతున్నాయన్నారు. ప్రతి 77నిమషాలకు ఒక వరకట్న హత్య, ప్రతి 48నిమషాలకు ఒక దళిత మహిళా అత్యాచారానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి 75ఏళ్ళుపూర్తి చేసుకున్నా ఆడపిల్లలకు సరైన విద్య, ఉద్యోగం, ఉపాధి అందడంలేదన్నారు. శ్రామిక మహిళాలకు సమానపనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. వీటిని ఐద్వా జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. హింస అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు బి.కరుణ, సత్యవతి, ఆదిలక్ష్మి, లక్ష్మి, పార్వతి, చిన్నతలి, జానకి, జోతి, శ్యామల తదితరులు పాల్గొన్నారు

ర్యాలీ చేస్తున్న ఐద్వా నాయకులు, మహిళలు

రోశయ్యకు ఘన నివాళి

శృంగవరపుకోట : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మణిబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఘన నివాళులు అర్పించారు. ముందుగా రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మణి ాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులను అలంకరించి నిష్పక్షపాతంగా పనిచేసిన వ్యక్తి రోశయ్య అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన అడుగుజాడల్లో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నానాజీ, వెన్నకోట భాస్కర్ శర్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోశయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ప్రతి కార్యకర్త జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు సూచించారు. మండల కేంద్రంలో గల శాంభవి లేఅవుట్‌లో ఆదివారం జనసేన ఆత్మీయ సమ్మేళన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు షేక్ ఫిరోజ్, రామెల్ల శివాజీ, అలమండ రాంబాబు, పిల్లా సురేష్, నాయుడు తదితరులు మాట్లాడుతూ కొత్తవలస, వేపాడ మండలాలలో నియమించినట్లే మరో 15 రోజులలో మండల పార్టీ అధ్యక్షులు నియమితులవుతారని తెలిపారు. ఈ సమావేశంలో విశాఖ పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు జొన్నపల్లి సత్తిబాబు, మల్లువలస శ్రీను, కొత్తవలస, వేపాడ మండల పార్టీ అధ్యక్షులు నక్కరాజు సతీష్, సుంకరి అప్పారావు, పిల్ల రామదుర్గ, గాలి అప్పారావు, వెంకటేష్‌తో పాటు వివిధ గ్రామాల నుండి సుమారు 150 మంది పాల్గొన్నారు.

వంతెన పనులు పరిశీలన

వంగర: మండలంలోని రుషింగి, వీరఘట్టం మండలం కిమ్మి నాగావళి నదిపై నిర్మిస్తున్న వంతెన పనులను రాజాం నియోజకవర్గం జనసేన నాయకులు ఎన్ని రాజు ఆదివారం పరిశీలించారు. ఈ మేరకు అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సాదేం రమేష్, యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

జనసేన పార్టీ మండల అధ్యక్షుడుగా సతీష్

కొత్తవలస : జనసేన పార్టీ మండల అధ్యక్షుడుగా నక్కరాజు సతీష్‌ను నియమిస్తూ ఆ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ తన మీద నమ్మకం ఉంచి, తనకు పార్టీ మండల భాద్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో పార్టీ విజయానికి, మండలంలోని అన్ని వర్గాలను కలుపుకుని, శక్తివంచన లేకుండా పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. ఈయన మండల శాఖ అధ్యక్షునిగా నియామకం పట్ల పలువురు పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- గరివిడి

చీపురుపల్లి మండలం రామలింగాపురం పిఎసిఎస్ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్నామన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేరుగా ట్రాన్స్‌ఫోర్టు, హమాలీ చార్జీలు, గోనె సంచులు అన్నీ ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మాత్రమే రైతులు ధాన్యం అమ్మాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు పనస అప్పారావు, సర్పంచ్ ఇప్పిలి నారాయణమ్మ, రావివలస ఎంపిటిసి పద్మ, రేవల్ల సత్తి బాబు, ఇప్పిలి రాము, కెల్ల మోహనరావు, కంది అప్పలనాయుడు, శిరెల రాములు, కంది శ్రీరాములు, ప్రభాత్, మురళి, ఆనంద్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

బాడంగి: రామభద్రపురం మండలం మిర్తివలస గ్రామానికి చెందిన పాచిపెంట శ్రీనివాస్‌రావు(42) బాడంగి మండలంలో బొత్సవానివలసలో పురుగులు మందు తాగి మృతి చెందాడు. ఆ గ్రామంలో రెండేళ్ల క్రితం కోళ్ల ఫారం లీజుకు తీసికొని భార్య, కొడుకుతో అక్కడే ఉంటున్నారు. మద్యానికి బానిసైన అతన్ని తాగొద్దని భార్య మందలించింది. దీంతో మనస్థాపానికి గురై శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే స్థానిక పిహెచ్‌సికి అక్కడి నుంచి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు.

నూతనంగా ఎన్నికైన బొబ్బిలి తాలూక యూనిట్ సభ్యులు

ఎన్‌జిఒ సంఘం ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎన్‌జిఒ సంఘం బొబ్బిలి తాలూక యూనిట్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం బొబ్బిలి తాలూక యూనిక్ ఎన్నిక జె. విక్టర్ సమక్షంలో నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జి.సూర్యనారాయణ, బి.రామారావు, అసోసియేట్ అధ్యక్షులుగా వెంకటనాయుడు, ఉపాధ్యక్షులుగా పి.ప్రసాదరావు, జి.రామారావు, జి.రామలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా జి.రామసత్యం, జి.రవికుమార్, సిహెచ్ భాస్కర్ పట్నాయక్, సిహెచ్ పద్మావతి, కోశాధికారిగా సిహెచ్ శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజ్యాంగం, అసోసియేషన్ నిబంధనలకు లోబడి ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి పోరాటం చేస్తామని నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. నూతన కమిటీ సభ్యులను రాష్ట్ర నాయకులు డివి రమణారావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు రామమూర్తి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారి కెడిఆర్ మృతి

బొబ్బిలి : పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి కింతలి దామోదరరావు అనారోగ్యంతో ఆదివారం తన నివాసంలో మరణించారు. గత కొన్ని రోజులుగా కెడిఆర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మరణించారు. కెడిఆర్‌కు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు మురళి చిట్స్ వ్యాపారం చేయగా మిగిలిన కుమారులు శ్రీనివాసరావు, బంగారురాజు, శివ వ్యాపారం చేస్తున్నారు. కుమార్తె ప్రసన్న అమెరికాలో ఉంటున్నారు. రెండో కోడలు గీత బిసి కార్పోరేషన్ డైరెక్టర్‌గాను, మూడో కోడలు శ్రీదేవి టిడిపి కౌన్సిలర్‌గా పని చేస్తున్నారు. కెడిఆర్ మృతికి పట్టణ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.


కెడిఆర్(ఫైల్)

మద్దతుధరకే ధాన్యం కొనుగోలు చేయాలి

గజపతినగరం : రైతులను మోసం చేయకుండా మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు దాసరి సింహాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతేడాది ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ ఏడాది అలా కాకుండా పగడ్బందీగా కొనుగోలు చేయాలన్నారు. గోనె సంచులకు కూడా మిల్లర్లు చుట్టూ తిప్పారని, 10 కేజీల నుండి 20 కేజీల వరకు తూకాల్లో రైతులకు నష్టాలు తెచ్చారని గుర్తు చేశారు. మరో గత్యంతరం లేని పరిస్థితులు తెచ్చిపెట్టి రైతుల్ని దగా చేశారన్నారు. గతం లాగా రైతులను మోసం చేయకుండా సకాలంలో కనీసం మద్దతు ధరతో గోనే సంచులు తగినంత సరఫరా చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

మహాసభకు హాజరవ్వండి

విజయనగరంకోట: పట్టణంలో మంగళవారం నిర్వహించనున్న బిసి మహా సభకు బిసి నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరు కావాలని తూర్పు కాపు విభాగం సాధికారిత బిసి సెల్ కన్వీనర్ కంది మురళీ నాయుడు అన్నారు. అశోక్ బంగ్లాలో ఆయన ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఈ సభకు హాజరువ్వాలని కోరారు. ప్రభుత్వం బిసిలకు చేస్తున్న అన్యాయంపై ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నగర పార్టీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ, వరప్రసాద్, కొండ శ్రీను నాయుడు పాల్గొన్నారు.

వేలం ప్రకటన
మహారాజ శ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
EP No : 90/2017 OS No: 392/2015
Between:
Balla Kurma Rao ......DHR/Plaintiff
And:
Adpa Arundhathi and 2 others
....JDRS/ Defendants
డిక్రీ సొమ్ము JDRS/ Defendants నుండి వసూలు నిమిత్తం ఈ క్రింది ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్థి పై కోర్టులో **తే 21-12-2022దీన ఉదయం 10-30 గం॥ల నుండి సాయంత్రం 5-00గం॥ల** వరకు పై కోర్టుకు హాజరై పాడుకొనవలెను.
SCHEDULE PROPERTY
District : Vizianagaram, **Sub-Registrar :** Vizianagaram, **Mandal :** Vizianagaram, **Town :** Vizianagaram, **Street :** Vuda Colony.
Market Value Rs : 4,00,000/-
RCC Slabbed House bearing its D.No: 1-17, MIG-138, Situate in Kanapaka and Ayyannapeta, Vuda Colony, Phase - IV, in S.No: 202 Part of Vizianagaram Town and District and
Measuring about:
East : 50 Feet (15.24 Meters)
West : 50 Feet (15.24 Meters)
South : 30 Feet (9.14 Meters)
North : 30 Feet (9.14 Meters)
Bounded by:
East : House No: MIG - 139
South : House No: HIG - 35
West : House No : MIG - 137
North : 33 feet wide Road
DHR Value of Rs. 4,00,000/-
Amin Value of Rs. 6,00,000/-
JDRs Value not Furnished
Market Value Rs. 23,96,990/-
The above Mentioned Property is under mortgage and the soul will be conducted subject to mortgage.
షరా : పై వేలంకు సంబంధించిన విషయములు, భోగట్టా కావలసినవారు DHR Advocate ఆఫీసునకు వచ్చి తెలుసుకొనవలయును.
A.N.V. Anjani Kumar
Advocate
F-1, Sai Amrutha Castles,
1st Line Down, Kothagraharam,
Vizianagaram - 1
Mobile No: 9440123159

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE : VIZIANAGARAM
I.P. 18/2022
Between:
Jami Appalaraju .....Petitioner
And:
Surireddi Yerrinaidu& Others ...Respondents
NOTICE
To,
1.Surireddi Yerrinaidu S/o late Sanniyya Age 55 Years, Finance Business, Bazar centre Jami Village & Mandal, Vizianagaram District.
2. The Branch Manager, APTUS Value Housing Finance India Limitited, Plot No:-24, Above Vijaya Bank, SriRamanagar Colony, 100 Feet Ring Road, Vizianagaram-535002
3. Patnala Kumari w/o Ravi Age33 Years, House-Wife, Mettala Dibba, Vinayaka Temple, Saraswathi Park Junction Visakhapatnam.
4.Vaka VaraLakshmi w /o Krishna Age 60 years, House-Wife, Chukka Street, Jami Village & Mandal Vizianagaram District.
5.Gadamn Ramayamma w/o late Satyan, Age 65 years, B.C. Colony, Jami Village & Mandal Vizianagaram District
6.Doddakayala Trinadha Venkata Satyanarayana S/o late Yerrinaidu Age 43 years M.G.Road, Jami Village & Mandal Vizianagaram District.
7.Srikakulapu Trinadha w/o Sundaramma Age35 years Relli Veedhi, Dondaparthi JnJami Village & Mandal Vizianagaram District
8.B.Krishnaveni w/o B.J.Naidu,Age 37 years, House-Wife,, B.C.Colony, Jami Village &; Mandal Vizianagaram District
9.Siripurapu Krishnamma w/o Srinu, Age 42 Years B.C. Colony, Jami Village & Mandal Vizianagaram District
10 Varri Rama Lakshmi w/o Sattibabu, Age 38 Years, B.C.Colony, Jami Village & Mandal Vizianagaram District
11.Jankala Ramana S/o Simhachalam, Age 45 Years SakhaVeedhi,Jami Village & Mandal, Vizianagaram Disrict
12.Chalumuri Yerri Naidu s/o Late Sanyasappadu, Age 33 Years, Neyyila Street, Jami Village & Mandal, Vizianagaram Disrict
13.Gorle Ramana s/o late Mutyala Naidu Age 44 Years, Manyala Street Jami Village & Mandal, Vizianagaram Disrict
14. Muppanna Ravi Kumar s/o Malleswararao, Age 45 years, Bulli raju Apartments, Kumaram Village, Mandal, Vizianagaram Disrict
......Respondents
పై నెంబర్ ఐ.పి. 18/2022 లో పిటిషనర్ ఇందలి రెస్పాండెంటుల వద్ద నుండి ఋణములు తీసుకోని దరిమిల దివాలా తీసినందున అందుకు పిటిషనరు ఇన్‌సాల్వెంట్ పర్సనగా డిక్లేర్ చేయమని కోరుచూ పై వ్యాద్యము దాఖలు చేయగా, సదరు వ్యాద్యము తే॥14-12-2022దిన వాయిదా వేసినారు. కావున అందుకు ఎవరికైన ఎటువంటి అక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టులో **తే॥ 14-12-2022 దిన ఉదయం గం॥ 10-30 ని॥**లకు హజరు అయి వారి అక్షేపణలు తెలియపరచుకోనవలనదిగా ఇందుమూలంగా తెలియజేయడమైనది.
పతివాడ బలరామ్
అడ్వకేట్, విజయనగరం